క్లుప్తంగా

మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు



ఆలయ పనులు ప్రారంభించిన దృశ్యం

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన ఆలయం శ్రీకమల మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కేంద్ర పురావస్తు శాఖ చర్యలు చేపట్టింది. ఆలయంలో కనీస మౌలిక వసతుల కల్పనకు రూ.35 లక్షల నిధులు మంజూరైనట్లు ఆ శాఖ సీఏ యోగేష్ తెలిపారు. మంజూరైన నిధులతో ఇప్పటికే ఆలయంలో వాటర్ ప్లాంట్, మహిళలు, పురుషులు, దివ్యాంగులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వరికోతలను త్వరగా పూర్తి చేయండి



వరికోత పనులను పరిశీలిస్తున్న డీఏఓ ఉమా మహేశ్వరమ్మ

కణేకల్లు: అగ్రికల్చర్ ఫాంలో వరికోతలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ అధికారులకు ఆదేశించారు. ఎస్ఎస్ఎంఎఫ్ (స్టేట్ సీడ్ మల్టిఫికేషన్)ఫాంలో కొనసాగుతున్న వరికోత పనులను జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటితో కలిసి డీఏఓ శుక్రవారం పరిశీలించారు. వరికోత పనులు త్వరగా పూర్తి చేసి వరి ధాన్యాన్ని ఆరబెట్టాలన్నారు. ఏపీ సీడ్స్‌కు వరి ధాన్యం అప్పగించాల్సి ఉన్నందున ఏమాత్రం ఆలస్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఫాం ఏడీఏ నారాయణనాయక్, రైతు శిక్షణ కేంద్రం ఏఓ శ్రీనివాసులు, ఏఓ శ్రవణ్‌కుమార్, ఏఈఓ మణికంఠ పాల్గొన్నారు.

ఆర్‌టీఓ కార్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన



ఆర్‌టీఓ కార్యాలయం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వసంత్‌బాబు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిసర ప్రాంతాల్లో ఆర్టీఓ కార్యాలయం, టీటీడీ కల్యాణ మంటపం, దోబీ ఘాట్ ఏర్పాటుకు ఆర్‌డీఓ వసంత్‌బాబు, రెవెన్యూ సిబ్బంది స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. పటణం సమీపంలోని వివిధ సర్వే నంబర్లలోని స్థలాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కమిషన్ వంశీకృష్ణ భార్గవ్, తహసీల్దార్ భాస్కర్, సర్వేయర్ ప్రభాకర్, వీర్‌ఓలు పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో 2025 నూతన సంవత్సరం పద్మశాలీయ సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హాజరయ్యారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ పొరాళ్ల పురుషోత్తం, అఖిల భారత పద్మశాలి సంఘం కార్యదర్శి పొరాళ్ల రాజు, రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షురాలు జింక వసుంధర, పద్మశాలి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అరవా శివప్ప, చుంచుల నాగప్ప, ముకుంద, సోమపాండు పాల్గొన్నారు.

ధూమపానంతో ఆరోగ్య సమస్యలు

కూడేరు: ధూమపానంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఉన్నతి తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీ నుంచి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి, ధూమపానంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ యశోద, ల్యాబ్ టెక్నీషయన్ వేణుగోపాల్, ఎంహెల్‌హెచ్‌పీ రాణి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువు ఎదుగుదల

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే గర్భంలోని శిశువు ఆరోగ్యంగా ఉండి ఎదుగుదల బాగుంటుందని పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారిణి ఉన్నతి తెలిపారు. శుక్రవారం కూడేరు పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు అందించారు. ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యం.. అరచేతిలో ప్రాణం

• బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డికి చెందిన జ్యోతిబాయికి రెండు రోజులుగా తల నొప్పి తీవ్రంగా వచ్చింది. కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆమెను గుమ్మఘట్ట మండలం భూపసముద్రంలోని ఆర్‌ఎంపీ చిరంజీవి వద్దకు తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యుడు ఇంజక్షన్ వేసి ఇంటికి పంపాడు. కాసేపటికే వాపు వచ్చింది. తలనొప్పి తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారింది. వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆమె ప్రాణాలు విడిచింది. గురువారం భర్త రవినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

• బ్రహ్మసముద్రం మండలం చెలిమేపల్లికి చెందిన జంగలి హంపయ్యకు ఇటీవల జ్వరం వచ్చింది. వేపులపర్తిలో క్లినిక్ నిర్వహిస్తున్న ఓ ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. నడుం కింద భాగంలో సూది వేసి, మందులు ఇచ్చి పంపాడు. గంటల వ్యవధిలోనే కాలుకు బొబ్బలు వచ్చాయి. అది ఇన్‌ఫెక్షన్‌గా మారి, చివరకు ప్రాణాలు మీదికి వచ్చింది. ఈ విషయాన్ని గుర్తించిన ఆర్‌ఎంపీ.. అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

• డీ హీరేహాళ్ మండలం కల్యంలో లక్ష్మి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ పట్టణంలోని ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌కు వెళ్లింది. ఆయన ఇంజెక్షన్ వేసి, సెలైన్ పెట్టారు. మాత్రలు ఇచ్చి పంపారు. రెండు రోజుల్లోనే వైద్యం వికటించి ఆమె మృతిచెందింది. ఈ మూడు చోట్లే కాదు.. ఆర్‌ఎంపీల వైద్యంతో రోగులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు ఘటనలు జరిగితేనే హడావు డి చేసి, ఆతర్వాత షరా మామూలు అయిపోతున్నారు.



భూపసముద్రంలో క్లినిక్‌ను సీజ్‌చేస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీదేవీ, వైద్య సిబ్బంది

- నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌ల నిర్వహణ
- వైద్యం వికటించి పలువురు మృత్యువాత
- నాడి పడుతున్న అర్హతలేని వైద్యులు
- భూపసముద్రంలో వైద్యం వికటించి మహిళల మృతిపై ఆందోళన

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లోనూ సుమారు 500లకు తక్కువ కాకుండా క్లినిక్‌లు ఉన్నాయంటే అతిశయోక్తి లేదు. ఆపరేషన్లు మినహా అన్ని వ్యాధులకు తెలిసి, తెలియని వైద్యం చేస్తున్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి రోగులకు శ్యాంపిల్ మందులు అంటగడుతున్నారు. ఎక్కువ మోతాదులో సూది మందు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాల్సిన ఆర్‌ఎంపీలు ఎంబీబీఎస్‌లు తరహా స్కెతస్కోప్ చేతపట్టి అన్ని రకాల రోగాలకు వైద్యం చేస్తున్నారు. వీరిని నియంత్రించాల్సిన జిల్లా వైద్యాధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అప్పుడప్పుడు దాడులు నిర్వహించడం, సీజ్ చేయడం మళ్లీ వదిలేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల రాయదుర్గంలో అనుమతులు లేని క్లినిక్‌లను సీజ్ చేశారు. అయితే రెండు రోజులకే వాటిని తెరిచారు.

వైద్య రంగాన్ని పట్టించుకునేవారేరీ?

వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. రూ.వెయ్యి దాటితే చాలు.. ఎంత ఖరీదైన జబ్బుఅయినా ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా చికిత్సలు చేయించారు. ప్రతి గ్రామంలోనూ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, పట్టణ, గ్రామీణ ప్రాథమిక వైద్యశాలల్లో సరిపడా వైద్యులు, సిబ్బంది, ఫ్యామిలీ డాక్టర్ విధానం ఇలా ఎన్నో రకాల సేవలు అందించారు. దీంతో ఆర్‌ఎంపీల ప్రభావం తగ్గింది. కూటమి అధికారంలోకి రాగానే వైద్య రంగాన్ని పూర్తిగా పట్టించుకోవడంలేదు. దీంతో ఆర్‌ఎంపీలు వైద్యాన్ని మళ్లీ వ్యాపారంగా మార్చేస్తున్నారు.

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

గుమ్మఘట్ట: భూపసముద్రంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి గురువారం సీజ్ చేశారు. బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డికి చెందిన జ్యోతిబాయికి వేసిన ఇంజెక్షన్ వికటించి, అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రవిశంకర్, డెమో ఆఫీసర్ త్యాగరాజు, డిప్యూటీ డెమో ఆఫీసర్ గంగాధర్, గుమ్మఘట్ట, ఆవులదట్ల , బ్రహ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యులు రమేష్, రాజేంద్రప్రసాద్,రాజేష్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాలి. ఇంజెక్షన్ వేయడం, బెడ్లు ఏర్పాటు చేసి సెలైన్ బాటిళ్లు పెట్టడం వంటివి చేస్తే చర్యలు ఉంటాయి. అనుమతి లేని ఆర్‌ఎంపీల క్లినిక్‌లపై జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు, ఇతర సూపర్‌వైజింగ్ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తాం. భూపసముద్రంలో వైద్యం వికటించి మహిళ మృతి చెందినట్టు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు రావడంతో గ్రామాన్ని సందర్శించి క్లినిక్‌ను సీజ్‌చేశాం. చట్టపరమైన చర్యలకు ఆదేశాలిచ్చాం. క్లినిక్‌లలో ఎట్టి పరిస్థితుల్లో మందుల విక్రయించరాదు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

– భ్రమరాంబదేవీ, డీఎంహెచ్‌ఓ, అనంతపురం

కిశోరి వికాసంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి



కళ్యాణదుర్గంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌డీఓ వసంత్‌బాబు, అధికారులు

రాయదుర్గంటౌన్: కిశోరి వికాసంపై అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన అవసరమని సీడీపీవో పద్మావతి సూచించారు.శుక్రవారం స్థానిక డ్వామా హాల్‌లో రాయదుర్గం అర్బన్, రూరల్ సచివాలయ పరిధిలోని ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా ఉపాధ్యాయులు, మహిళా పోలీసులకు కిశోరి వికాసంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ, వెలుగు ఏపీఎం గోవిందప్ప, ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్‌డీ మురళీకృష్ణ, పీహెచ్‌సీ వైద్యుడు రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. కిశోరి బాలికలకు విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, లింగ వివక్షత, చట్టాలు, బాల్య వివాహాలు, బాలల చట్టాలు, ఆత్మరక్షణ, మానవ అక్రమ రవాణా అంశాలపైనా సమగ్ర అవగాహన కల్పించాలన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ తరగతులను సీడీపీఓ లక్ష్మీప్రసన్న అధ్యక్షతన ప్రారంభించారు. డీఎస్పీ రవిబాబు, మున్సిపాల్ కమిషనర్ వంశీ కృష్ణభార్గవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వసంత్‌బాబు, డీఎస్పీ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యలకు సత్వర పరిష్కారం

- గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు

వజ్రకరూరు: భూసమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని చాబాలలో సర్పంచు మల్లెల జగదీష్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీనీ సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. సర్పంచు మల్లెల జగదీష్ మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో 22 అర్జీలు, ఇతర సమస్యలపై ఏడు వినతులు వచ్చాయి. నియోజకవర్గ ప్రత్యేకాధికారి తిప్పేనాయక్, తహసీల్దార్ నయాజ్ అహమ్మద్, డీటీలు తహసిల్దార్లు నరేష్‌కుమార్, కేశవరెడ్డి, సర్వేయర్ మంజుల, ఆర్‌ఐ అశ్వర్థనారాయణ, వీఆర్‌ఓ సురేంద్ర, గ్రామపెద్దలు నారాయణప్ప, పంపాపతి, శ్రీనివాసులు, ఈశ్వరయ్య,బండారు సురేష్, కార్యదర్శులు నాగరాజు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రీ–సర్వేతో భూసమస్యలకు పరిష్కారం

బొమ్మనహాళ్ : భూసర్వేతో గ్రామాల్లో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. శుక్రవారం మండలంలోని కురువల్లి గ్రామంలో రీసర్వే ప్రాజెక్టుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, వీఆర్‌వో రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కణేకల్లు:సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఫణికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కణేకల్లు–2 గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం రైతులు, ప్రజల నుంచి పలు సమస్యలపై అధికారులు వినతులను స్వీకరించారు. ఇది ఇలా ఉండగా రెవెన్యూ సదస్సులు శుక్రవారం రోజుతో ముగిశాయి. ఈకార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, వీఆర్వో పవన్ తదితరులు పాల్గొన్నారు.



చాబాలలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

బొమ్మనహాళ్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ మునివేలు తెలిపారు. శుక్రవారం కురువల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు ఉన్న భూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. 12 వినతులు స్వీకరించారు. గ్రామానికి చెందిన రైతులు రామచంద్ర, గురురాజ్‌కు ఉన్న 1బీ అడంగల్ సమస్యలు పరిష్కరించారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శప్రాయం



ఉరవకొండ గురుకుల పాఠశాలలో విజేతలకు సర్టిఫికెట్లు, షీల్డు అందించిన జేవీవీ నాయకులు



రాయదుర్గంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్: సమాజంలో అసమానతలు రూపుమాపినసావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఉపాధ్యాయులతో కలిసి సావిత్రబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయప్రద, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉరవకొండ: సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డ్రైవర్స్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రి జయంతి సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులు పార్వతీ, సరితా, రేణుకలను విద్యార్థులతో కలిసి సత్కరించారు. అనంతరం సమాజంలో మహిళలల ప్రాధాన్యతపై వివరించారు.

అంబేద్కర్ గురుకులంలో వేడుకలు: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, పోలేరమ్మ ఆలయం ధర్మకర్త, చైర్మన్ పి.దొడ్డప్ప, పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూనల ఆధ్వర్యంలో పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. జేవీవీ నాయకులు హరిప్రసాద్, చైర్మన్ దొడ్డప్ప మాట్లాడారు.

బ్రహ్మసముద్రం: పిల్లలపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్ సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి , చిన్నవన్నప్ప, రామాంజనేయులు, గోవిందరెడ్డి, కుమారస్వామి, సరళ, జయశ్రీ, సుధాబాయి, హేమావతి పాల్గొన్నారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా ఎస్కే చారిటబుల్ ట్రస్టు పర్యవేక్షణలో నడుస్తున్న విలువల బడుల్లో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, నాగరాజు, కావ్య, దిలీప్, చాందినీ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి

డి హీరేహాళ్ (రాయదుర్గం): వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంట్రామిరెడ్డి సూచించారు. శుక్రవారం డి హీరేహాళ్ మండలానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, సుదర్శనరెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, మురళీమోహన్‌రెడ్డి, అంజిరెడ్డి అనతంపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి నాయకత్వంలో పటిష్టంగా పనిచేయాలని ఆదేశించారు. నూతన కమిటీలు ఆవిష్కరణ అనంతరం రాయదుర్గంలో పర్యటించి పార్టీ బలోపేతానికి చర్యలు చేపడతామని సూచించారు.



జిల్లా అధ్యక్షుడు అనంతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

నేడు ఆడిటోరియం ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో దాతలు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.18 లక్షలతో నిర్మించిన ఆడిటోరియాన్ని శనివారం ప్రారంభించనున్నారు. తెలుగు అధ్యాపకుడు వీరేష్ మాట్లాడుతూ ఆడిటోరియం నిర్మాణానికి పూర్వ విద్యార్థులు, సీనియర్ న్యాయవాది అనంతరామాచార్యులు రూ.50 వేలు, పూనెలోని కెనరా బ్యాంకు ఆర్‌ఎం రఘుశేషు రూ.50, బ్యాంకు తరపున రూ.1.50 లక్షలు, కళాశాల తోటి అధ్యాపకులు రూ.87 వేలు అందించారన్నారు. ఉదయం 10.30 గంటలకు ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మించిన ఆడిటోరియం

జాతీయ స్థాయి పోటీలకు బయల్దేరిన సాఫ్ట్‌బాల్ జట్టు



జట్టును అభినందిస్తున్న హెచ్‌ఎం వేణుగోపాల్, పీడీ సత్యనారాయణ, కళా సుధాకర్

వజ్రకరూరు: మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి అండర్–17 బాయ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ జట్టు శుక్రవారం బయల్దేరి వెళ్లింది. ఈనెల 5 నుంచి 9 వరకు జాతీయ స్థాయి పోటీలు జరుగనున్నాయి.జట్టును హెచ్‌ఎం వేణుగోపాల్, పీడీలు సత్యనారాయణ, కళా సుధాకర్, ప్రసాద్, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, నాగేంద్ర గౌడ్ తదితరులు అభినందించారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోండి

విడపనకల్లు: కంది విక్రయాలకోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ పెన్నయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వేల్పుమడుగులో కందులను ఏఓ పరిశీలించారు. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి మద్దతు ధర రు.7,750 ప్రకటించిందని రైతులకు సూచించారు. సాగు చేసిన పంటలను దళారులకు విక్రయించి నష్ట పోవద్దని ఏఓ సలహాలు ఇచ్చారు. ఆర్ఎస్‌కే సిబ్బంది కుళ్లాయినాయక్, వెటర్నరీ అసిస్టెంట్ మహేష్, రైతులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

కంబదూరు: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శి ముత్యాలు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతులు తమ గ్రామ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

జగనన్న లేఅవుట్ భూములు తనిఖీ



ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఉరవకొండ: ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో జగనన్న లేఅవుట్‌లను విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో జగనన్న లేఅవుట్ భూముల రికార్డులను పరిశీలించారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించారా? అన్న కోణంలో విచారణ చేపట్టారు. భూమి ఇంటి నిర్మాణాలు చేపట్టడానికి అనువైనదా? లేదా అంటూ ఆరా తీశారు. దీంతో పాటు భూ యజమానులను తహసీల్దార్ కార్యాలయం పిలిపించి, వివరాలు సేకరించారు. ఈసందర్భంగా విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, వాసుప్రకాష్, జమాల్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న లేఅవుట్ భూములపై విచారణలో భాగంగా ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో విచారణ చేపట్టి రికార్డులను పరిశీలించి, నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ తదితరులు

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతూరు జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థిని అనిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఎనిమిదోతరగతి విద్యార్థిని అనిత ఈనెల 10 నుంచి 15 వరకు మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 ఖోఖో పోటీల్లో పాల్గొంటోందని హెచ్‌ఎం ప్రసాద్,పీడీ ప్రభాకర్ తెలిపారు. అనంతరం పీడీ మాట్లాడుతూ నవంబర్ 23,24,25 తేదీల్లో జరిగిన అండర్ 14 ఖోఖో పోటీలలో విద్యార్థిని పాల్గొని ప్రతిభ కనబరిచిందన్నారు.

సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకున్న అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డులోని సామిల్ ఏరియాలో ఓ సెల్ టవర్ నిర్మాణం కోసం జేసీబీతో తవ్వుతుండగా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. స్థానికులు షబ్బీర్, శంకరప్ప, నాగరాజు, శ్రీధర్ తదితరులు మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి అనుమతి లేకపోవడంతో పనులను అడ్డుకొని నిలుపుదల చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీపీఎస్ మురళీమోహన్ హెచ్చరించారు.

7న జెండా ఆవిష్కరణ

ఉరవకొండ: స్థానిక అజ్మీర్‌లోని హజరత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తి (గరీబ్‌నవాజ్) ఉరుసును పురస్కరించుకొని ఈనెల 7న గరీబ్ నవాజ్ చట్టి షరీఫ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షేక్ మహమ్మద్ జమీర్ హుసేనీ అష్రఫీ ఖాద్రీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జెండాకట్ట వద్ద నుంచి గరీబ్‌నవాజ్ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం పెద్ద ఎత్తున స్వామి జెండా ఊరేగింపు (జూలూస్) నిర్వహిస్తామన్నారు. జూలుస్ అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పశుసంవర్ధక శాఖపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: పశుసంవర్ధకశాఖపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆశాఖ సంచాలకులు శ్రీనివాస్‌గుప్త సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పశువైద్యశాల ఆవరణలో లిటిల్ రోజెస్ స్కూల్ విద్యార్థులకు పశు సంవర్ధక శాఖపై అవగాహన కల్పించారు. పశువైద్యులు, లిటిల్ రోజెస్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

రాయదుర్గంటౌన్: సమ్మె కాలపు ఒప్పందాలకు సంబంధించిన జీవోలను అమలు చేసి మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు తిప్పేస్వామి, మల్లేష్, ఇంజనీరింగ్ విభాగం నాయకులు తిప్పేరుద్ర, రామంజనేయులు, నగష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో విద్యార్థికి గాయాలు

గుమ్మఘట్ట: మండలంలోని కోనాపురం సమీపంలో 10వ తరగతి విద్యార్థి హరికృష్ణపై ఎలుగుబంటి దాడి చేసింది. శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలో మొక్కజొన్న పొలంలోకి బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో బాలుడి కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని ఎలుగుబంటిని తరిమేశారు. క్షతగాత్రుడిని రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.